

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలన భేష్ అంటూ ప్లకార్డులతో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు



మసీదు వద్ద ప్రచారం చేస్తున్న నవీన్‌యాదవ్



ఎర్రగడ్డలో మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్‌తో కలిసి ప్రచారం చేస్తున్న నవీన్‌యాదవ్

ప్రజలు నా వైపే: నవీన్‌యాదవ్

బంజారాహిల్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టికెట్టు రాకుండా అడ్డుకున్నారు.. ఇప్పుడు పోటీలో నిలబడ్డాడని ప్రతిపక్షాలు అనేక నిందలు వేస్తున్నారు.. అవి వాస్తవాలు కావని తెలుసుకున్న ప్రజలు ఎక్కడకు వెళ్లినా ఆశీర్వదిస్తున్నారని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ ప్రభాత్‌నగర్, సుల్తాన్‌నగర్, శంకర్‌లాల్ నగర్‌లో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, నిర్మల్ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం జామ మసీదు, నూరు మసీదు, సుల్తాన్‌బాగ్ మసీదుల వద్ద ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ రెండుసార్లు ఓడిపోయినా ప్రజాసేవను వీడలేదన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే ప్రజలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. యూసుఫ్‌గూడ, కృష్ణానగర్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి లలిత, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభనారెడ్డి, నవీన్‌యాదవ్ సతీమణి వర్ష ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఓటు అభ్యర్థించారు.



ప్రచారం చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మంత్రి శ్రీహరి సతీమణి లలిత



బోరబండలో జరిగిన వడ్డెరుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి



కాంగ్రెస్ పార్టీలో చేరిన యువతిని దీవిస్తున్న మంత్రి పొంగులేటి

వడ్డెరులకు అండగా కాంగ్రెస్

బోరబండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెరులకు అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రులు డా.సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ అజారుద్దీన్ తెలిపారు. పని ప్రాంతాల్లో ప్రమాదాలకు గురైతే పరిహారం ఇస్తామని ప్రకటించారు. బోరబండ సైట్-3 కాలనీ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కమ్యూనిటీహాల్‌లో జాతీయ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వడ్డెరుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తం, చెమట చిందించి రాళ్లను కరిగించి పటిష్ఠమైన నిర్మాణాలు చేసిన వడ్డెరులు హైదరాబాద్ నగర అభివృద్ధికి వెన్నెముకలని ప్రశంసించారు. దివంగత సీఎల్పీ మాజీనేత పీజేఆర్ హయాంలో వడ్డెరులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని, బీఆర్ఎస్ పాలనలో వాటిని లాక్కున్నారని విమర్శించారు. వడ్డెరులకు పక్కా ఇల్లు కట్టించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు పిట్ల శ్రీధర్ అధ్యక్షత వహించిన ఈ సమ్మేళనంలో డిప్యూటీ స్పీకర్ రామచంద్రు నాయక్, ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా హసన్ ఉల్ అఫెండి, ఎంబీసీ చైర్మన్ జెరిపెటి జైపాల్, ఎంఐఎం యువజన విభాగం అధ్యక్షుడు యాసర్ అరాఫత్, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి అన్వర్ సాదత్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజా రేణుక, జాతీయ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లెపు శివకుమార్, వి.నర్సింగ్‌రావు, బత్తుల లక్ష్మీకాంతయ్య, పల్లపు రమేశ్, ఆంజనేయులు, బోదాసు రవి, వేముల లక్ష్మణ్, వి.యాదయ్య, జి.యాదయ్య, డి.నర్సింహ, గొలుసుల ఎల్లయ్య పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న మాగంటి సునీత

బీఆర్ఎస్ గెలుపు జూబ్లీహిల్స్ అభివృద్ధికి మలుపు

యూసుఫ్‌గూడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు జూబ్లీహిల్స్ అభివృద్ధికి మలుపు అని మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన యూసుఫ్‌గూడలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి పనులే సునీతను గెలిపిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అరిగె శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, వైవీ అప్పారావు, కోన నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కళా స్పందన ఆర్ట్ ఫెయిర్

- ప్రారంభించిన నటి బ్రిందా రాజేశ్వరి



ప్రదర్శనను ప్రారంభిస్తున్న నటి బ్రిందా రాజేశ్వరి

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో 'కళా స్పందన ఆర్ట్ ఫెయిర్‌'ను నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనను నటి బ్రిందారాజేశ్వరి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదేళ్లుగా ఈ ప్రదర్శన నిర్వాహకులు ముంబై, పూణేలో విజయవంతంగా తమ ప్రదర్శనలు చేశారని, ఇప్పుడు హైదరాబాద్, ఢిల్లీలో కూడా ప్రదర్శనలు చేస్తుండడం సంతోషంగా ఉందని అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వంద మందికి పైగా కళాకారులు సుమారు 2వేల కళాకృతులను ప్రదర్శిస్తున్నారని నిర్వాహకుడు సుదీప్ చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ కళాకారుడు జీవై గిరి, సెలబ్రిటీ ఆర్టిస్ట్ రామ్‌జీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులను అభివృద్ధి చేసుకోవాలి

ఎర్రగడ్డ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని మార్చుకుంటూ కులవృత్తులను అభివృద్ధి చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎర్రగడ్డలో నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.



నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కాంగ్రెస్ పార్టీలో చేరిక

బోరబండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రహ్మత్ నగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రహ్మత్ నగర్ కార్పొరేటర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎస్పీఆర్ హిల్స్ ఓంనగర్‌కు చెందిన ముద్దంగుల శేఖర్ 100 మంది మహిళలతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బోరబండకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహ్మద్ బాబర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్ రెడ్డి పాల్గొన్నారు. అర్బాజ్, మున్నీస్, నవాజ్, షాహిద్, ఆసిఫ్, రహమాన్, రియాన్, ఇబ్రహీం, ఫిరోజ్, అబుజార్, వినయ్, అజార్, సిరాజ్, సయ్యద్ రిహాన్ తదితరులు నవీన్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.



బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహ్మద్ బాబర్‌ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న షబ్బీర్‌అలీ

నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ బోరబండ సైట్-1 కాలనీలో ప్రచారం చేస్తున్న తెలంగాణ జన సమితి(టీజేఎస్) హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.నర్సయ్య, హన్మంత్‌రెడ్డి, జస్వంత్ కుమార్, పి.జైపాల్‌రెడ్డి, సుధాకర్, జూబ్లీహిల్స్ మైనారిటీ అధ్యక్షుడు ఎం.డి.పాషా



గ్రేడ్-2 అధికారులకు సామర్థ్య వృద్ధి శిక్షణ

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నియమితులైన గ్రేడ్-2 అధికారులకు సామర్థ్య వృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని మున్సిపల్ పరిపాలన శాఖ(సీడీఎంఏ) ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి ఈనెల 17వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వాటర్‌బోర్డు ఈడీ మయాంక్ మిట్టల్ ప్రసంగించారు. హైదరాబాద్‌లో అమలవుతున్న నీటి సరఫరా, సివరేజీ నిర్వహణ వ్యవస్థలపై శిక్షణార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐయూఎం ఈడీ శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అపోలో వైద్య విద్యార్థులకు వైట్ కోట్స్ అందజేత

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రీసెర్చ్(ఏఐఎంఎస్ఆర్)లో ఎంబీబీఎస్-2025 బ్యాచి విద్యార్థులకు వైట్ కోట్స్ అందజేశారు. ఈ వేడుకను జూబ్లీహిల్స్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి అపోలో ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ కేజేరెడ్డి విద్యార్థులకు వైట్ కోట్స్ అందజేశారు. అనంతరం విద్యార్థులు వైద్య వృత్తి నైతికత, సేవా భావానికి ప్రతీకగా ప్రమాణం చేశారు. సమాజ సేవ, రోగి సంక్షేమం, నైతిక విలువలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.



వాసవి బృందావనం అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశమైన రామచందర్‌రావు

కేంద్రం నిధులను సద్వినియోగం చేయని సీఎం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

ఎర్రగడ్డ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిధులను సద్వినియోగం చేయలేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ఏం ఉద్ధరిస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఎర్రగడ్డలోని వాసవి బృందావనం గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆవాస్ యోజన పథకం కింద జూబ్లీహిల్స్‌లో ఎలాంటి గృహ నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో తీసుకురాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి కేవలం ముస్లింల ఓట్లు మాత్రమే కావాలా? ఇతర వర్గాల ఓట్లు అవసరం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అవినీతి, అహంకార పాలనకు ముగింపు పలకాలని, జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, ఎర్రగడ్డ ఇన్‌చార్జి మేకల సారంగపాణి, వాసవి బృందావనం అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు హనుమంతరావు, కల్పతరువు మాజీ అధ్యక్షుడు డాక్టర్ చేకూరు హనుమంతు నాయుడు, నాయకులు వీరయ్యగుప్తా, భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిక కార్యక్రమంలో మంత్రి సీతక్క, బండ్రు శోభారాణి తదితరులు

అన్నివర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- మంత్రి సీతక్క

బోరబండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యమని రాష్ట్ర మంత్రి డా.సీతక్క పేర్కొన్నారు. బోరబండ డివిజన్ బలహీనవర్గాల కాలనీలో శుక్రవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు లక్షలమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం కోరుకునే వారు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్‌కు చెందిన షేక్ జమీర్ బాషా 500 మందితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. వారిని సీతక్క పార్టీలోకి ఆహ్వానించారు. బోరబండ కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, బండ్రు శోభారాణి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డా. రోహిణ్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి

రాంనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో టీడీపీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా అధ్యక్షతన ఖైరతాబాద్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నా, లేకున్నా పార్టీని నమ్ముకొని అంకితభావంతో పనిచేస్తున్న కార్యకర్తలకు అధిష్ఠానం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు నల్లెల కిశోర్, పి.బాల్‌రాజ్ గౌడ్, ఎం.నర్సింహ, బాలరాజు, గోస్వామి, ప్రదీప్‌గౌడ్, వంశీకృష్ణ, ఎం.డి.సలీం, శాస్త్రి, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, కిరణ్, అనిల్ పాల్గొన్నారు.

కామన్వెల్త్ చెస్ హెచ్‌ఓడీగా ప్రసాద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కామన్వెల్త్ చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టుకు హెడ్ ఆఫ్ డెలిగేషన్(హెచ్‌ఓడీ)గా హైదరాబాద్ చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈనెల 8 నుంచి 17వ తేదీ వరకు మలేషియాలో జరిగే ఈ పోటీల్లో భారత్ నుంచి 55 మంది క్రీడాకారులు పోటీ పడుతున్నారు. తెలంగాణ నుంచి ఆదిరెడ్డి అర్జున్, శ్రీరామ్ ఆదర్శ్, నిదిశ్ శ్యామల ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఇక, హెచ్‌ఓడీగా నియమితులైన ప్రసాద్‌ని రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షులు లక్ష్మీరెడ్డి అభినందించారు.

పార్కింగ్ తొలగింపు

అమీర్‌పేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట హనుమాన్ ఆలయం ఎదుట వాహనాల పార్కింగ్‌ను శుక్రవారం తొలగించామని ఆలయ చైర్మన్ గుడిగే సత్యనారాయణ యాదవ్ తెలిపారు. ఆలయ పరిసరాలు, రేకుల షెడ్డు కింద వాహనాలు పార్క్ చేస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ నాగరాజు హెచ్చరించారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బౌద్ధనగర్ రామాలయం వద్ద ప్రారంభమైన రోడ్డు పనులు

బౌద్ధనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ రామాలయం వద్ద నూతన రోడ్డు నిర్మాణానికి అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. ఈ నెల 6న 'అంతర్గత రోడ్లు అధ్వానం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. స్పందించిన జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు బౌద్ధనగర్‌లోని రోడ్లను గురువారం పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన నూతన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కింది స్థాయి అధికారులను ఆదేశించారు. అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం బౌద్ధనగర్ రామాలయం వద్ద రోడ్డు పనులు జీహెచ్‌ఎంసీ సిబ్బంది ప్రారంభించారు. త్వరలో నూతన సీసీ రోడ్డును పూర్తి చేస్తామని స్థానికులకు అధికారులు హామీనిచ్చారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

అయ్యప్ప స్వాములకు అన్నదానం

బౌద్ధనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయం వద్ద అయ్యప్ప స్వాములకు నెల రోజులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గురుస్వామి అంజయ్య తెలిపారు. శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోజూ మధ్యాహ్నం 12 గంటలకు కనకదుర్గ ఆలయంలో అయ్యప్పస్వామి పడిపూజ అనంతరం 12.30 నుంచి 3 గంటల వరకు అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 6 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అయ్యప్ప స్వాములు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గురుస్వామి అంజయ్య కోరారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న విజయవాడ రీజనల్ అధికారి రమేష్ మేనన్ తదితరులు

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి

సైన్స్ ఫెయిర్ దోహదం

బోయినపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్ దోహదపడుతుందని విజయవాడ రీజనల్ అధికారి రమేశ్ మేనన్ అన్నారు. బోయినపల్లి సీతారాంపురంలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్‌లో రీజినల్ సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి రమేశ్ మేనన్, సెయింట్ పీటర్స్ విద్యాలయాల కరస్పాండెంట్ ఆల్ఫోన్స్ రెడ్డిలు పాల్గొని విద్యార్థుల నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సైన్స్ ఫెయిర్ అనేది విద్యార్థులు శాస్త్రీయ భావనలను ప్రదర్శించడానికి, ప్రయోగాలు చేయడానికి, నమూనాలను రూపొందించడానికి ఒక వేదిక అని వారు అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సువర్ణ, డైరెక్టర్ అరుణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ ఫాబియన్ ఫెరరోకు షీల్డ్ అందజేస్తున్న ప్రొఫెసర్లు

ఓయూలో ఐఓటీ ఇంటర్నేషనల్ సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ ఇన్ఫర్మేషన్ ప్రాసెసింగ్ (ఐఎఫ్ఐపీ) ఆధ్వర్యంలో 8వ ఇంటర్నేషనల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) సదస్సు ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్‌టీయూ హైదరాబాద్, ఎన్ఐటీ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైంది. ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఫాబియన్ ఫెరరో మాట్లాడుతూ.. ఐఓటీలో సైబర్ సెక్యూరిటీ, గోప్యత, సామాజిక ప్రభావం అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 35 పరిశోధన పత్రాలు, నాలుగు కీలక ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చ, మూడు ప్రీ-కాన్ఫరెన్స్ ట్యుటోరియల్స్‌తో ఈ కార్యక్రమం నవంబర్ 8 వరకు కొనసాగనుంది. జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కిషన్‌కుమార్‌రెడ్డి, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఫ్లోరిడా ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ కట్కూరి, దేశ విదేశాల నుంచి పరిశోధకులు, అధ్యాపకులు నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 అధికారులకు సామర్థ్య వృద్ధి శిక్షణ

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నియమితులైన గ్రేడ్-2 అధికారులకు సామర్థ్య వృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని మున్సిపల్ పరిపాలన శాఖ(సీడీఎంఏ) ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి ఈ నెల 17వరకు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వాటర్‌బోర్డు ఈడీ మయాంక్ మిట్టల్ ప్రసంగించారు. హైదరాబాద్‌లో అమలవుతున్న నీటి సరఫరా, సీవరేజీ నిర్వహణ వ్యవస్థలపై శిక్షణార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఐయూఎం ఈడీ శ్రీనివాస్ రావు, అసిస్టెంట్ మేనేజర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అపోలో వైద్య విద్యార్థులకు వైట్ కోట్స్ అందజేత

హైదరాబాద్ సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ రీసెర్చ్(ఏఐఎంఎస్ఆర్)లో ఎంబీబీఎస్-2025 బ్యాచి విద్యార్థులకు వైట్ కోట్స్ అందజేశారు. ఈ వేడుకను జూబ్లీహిల్స్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. అపోలో ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ కేజేరెడ్డి విద్యార్థులకు వైట్‌కోట్స్ అందజేశారు. అనంతరం విద్యార్థులు వైద్య వృత్తి నైతికత, సేవా భావానికి ప్రతీకగా ప్రమాణం చేశారు. సమాజ సేవ, రోగి సంక్షేమం, నైతిక విలువలు పాటిస్తామని వైద్య విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

జిల్లా కోర్టులో న్యాయమూర్తుల పోస్టుల భర్తీ

కుషాయిగూడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుషాయిగూడలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టు సముదాయంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కూకట్‌పల్లి కోర్టులో 'పోక్సో' ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ జడ్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.ఎస్.ఎన్.అమరావతి మేడ్చల్- జిల్లా కోర్టు 2వ అదనపు డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి-కమ్-ఒకటవ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆమె మహిళా వేధింపులు, ఫ్యామిలీ కోర్టుకు సంబంధించిన కేసుల ఫాస్ట్ ట్రాక్ విచారణ చేపడతారు. ఇక జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శిగా సేవలందిస్తున్న డి.కిరణ్ కుమార్‌కు పదోన్నతి కల్పిస్తూ 4వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి బాధ్యతలతో పాటు సైబరాబాద్ 3వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా విధులు అప్పగించారు. సిటీ సివిల్ కోర్టు 2వ అదనపు జడ్జి చిట్టిబొమ్మ ఆశాలతను కుషాయిగూడలోని పోక్సో యాక్ట్ కేసుల ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక విచారణ కోర్టు జడ్జిగా బదిలీ చేశారు.

పంపకాల్లో పేచీ!

- కిందిస్థాయి, ఉన్నతాధికారుల మనస్పర్ధలు
- మామూళ్లు, నిర్లక్ష్యంతో బంధానికి బీటలు
- ఇప్పటి వరకు గప్‌చుప్‌గా సాగిన దందా

● కంటోన్మెంట్ 8 వార్డుల్లో అక్రమ నిర్మాణాల బాగోతమిదీ..

సికింద్రాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో కొద్ది రోజులుగా కింది, ఉన్నత స్థాయి ఉద్యోగుల మధ్య మనస్పర్ధలు నెలకొన్నాయి. అక్రమ నిర్మాణదారుల నుంచి కింది స్థాయి ఉద్యోగులు వసూళ్లకు పాల్పడుతుండటం, వారి పట్ల ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వహించడమే కారణంగా తెలుస్తోంది. కొన్ని అక్రమ కట్టడాలను నేలమట్టానికి కిందిస్థాయి ఉద్యోగులు సన్నద్ధం అవుతున్నారని వినికిడి. ఇది కాస్త అక్రమ నిర్మాణదారుల మెడకు చుట్టుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు దందాలో పంపకాల తేడాలు రాకపోవడంతో గప్‌చుప్‌గా సాగింది.

విషయానికొస్తే... కేంద్ర రక్షణ శాఖ పరిధిలో ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో ఇంటి నిర్మాణ నిబంధనలు భిన్నంగా ఉంటాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమలవుతున్న భవన నిర్మాణ నిబంధనలకు, ఇదే విషయంలో కంటోన్మెంట్‌లో అమలవుతున్న నిబంధనలకు తేడా ఉంది. ముఖ్యంగా బేగంపేట్ విమానాశ్రయం ఉన్న కారణంగా సికింద్రాబాద్- కంటోన్మెంట్ బోర్డు పరిధిలో జి ప్లస్ 2 అంతస్తులకు మించి (బహుళ అంతస్తుల) భవన నిర్మాణాలకు అనుమతి లేదు.



కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

నగరం నడిబొడ్డున భూమి విలువ రోజురోజుకూ పెరుగుతుంది. అలాగే కుటుంబం పెద్దగా అవుతుండడం, వాణిజ్య అవసరాలుండటం తదితర కారణాలతో కంటోన్మెంట్‌లోని మొత్తం 8 వార్డుల్లో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. వారు స్థానిక రాజకీయ నాయకులు, ఇతర దళారుల సహకారంతో కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులను కలిసి, పెద్ద మొత్తంలో మామూళ్లు ముట్టచెబుతూ యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. చాలా కాలంగా అన్ని వార్డుల్లో లెక్క లేనన్ని అక్రమ నిర్మాణాలు వెలిశాయి. అయితే రాజకీయ నాయకులు-దళారులు-పై స్థాయి అధికారులు, కింది స్థాయి అధికారుల మధ్య పంపకాల విషయంలో తేడాలు రాకపోవడంతో అంతా గప్‌చుప్‌గా సాగిపోయింది. అయితే కొద్ది రోజులుగా మామూళ్ల విషయంలో అంతర్గతంగా మనస్పర్ధలు తలెత్తుతున్నాయని తెలిసింది. ఇటీవల సికింద్రాబాద్ కంటోన్మెంట్ నూతన ముఖ్యకార్యనిర్వహణాధికారి అర్వింద్‌కుమార్ ద్వివేది.. బోయినపల్లిలో పార్కు స్థలంలో అక్రమ నిర్మాణం విషయమై ఫిర్యాదు రాగానే కూల్చివేతలు చేపట్టారు. ఇప్పుడు అక్రమ నిర్మాణాల చిట్టాను తీసుకువెళ్లి, నేలమట్టానికి నోటీసులు జారీ చేసే దిశగా కింది స్థాయి అధికారులు కసరత్తు చేస్తున్నట్టు భోగట్టా.

విద్యార్థులు రోడ్డు దాటేదెలా..?

- సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద పని చేయని ఎస్కలేటర్
- ఏడాదవుతున్నా బాగు చేయని అధికారులు
- ఇబ్బంది పడుతున్న చిన్నారులు

అడ్డగుట్ట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు రోడ్డు దాటేందుకు జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన ఎస్కలేటర్ ఏడాది కాలంగా పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలకు పిల్లలను తీసుకువస్తున్న తల్లిదండ్రులు కూడా ఏమవుతుందోనని భయపడుతున్నారు. చేసేదేమి లేక ట్రాఫిక్ పోలీసుల సహకారంతో రోడ్డు దాటుతున్నామని పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఎస్కలేటర్ బాగు చేయాలని కోరుతున్నారు.



సికింద్రాబాద్ సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన ఎస్కలేటర్



పాడైపోయిన ఎస్కలేటర్

పనిచేయని ఎస్కలేటర్..

సికింద్రాబాద్‌లో సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఎస్కలేటర్ ఏడాది నుంచి పనిచేయడం లేదు. ఎస్కలేటర్ యంత్రాలు పాడైపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎస్కలేటర్ మధ్యలో రంధ్రం ఉండడంతో విద్యార్థులు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు రావడానికి, వెళ్లడానికి రోడ్డు దాటాలంటే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అనేక సార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎస్కలేటర్‌కు మరమ్మతులు చేసి విద్యార్థులకు వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ఇరవై ఏళ్ల క్రితం ఏర్పాటు

సికింద్రాబాద్ సెయింట్స్ స్కూలు పక్కనే ఉన్న ఎస్కలేటర్‌కు ప్రత్యేక చరిత్ర ఉంది. 2005లో కవాడిగూడకు చెందిన రితిక అనే అమ్మాయి మూడో తరగతి చదువుతుంది. పాఠశాల నుంచి బయటకు వచ్చిన ఆమె రోడ్డు పక్కన నిలబడగా రితికను లారీ ఢీకొన్నది. ప్రమాదంలో ఆమె చనిపోయింది. స్పందించిన జీహెచ్‌ఎంసీ అధికారులు అక్కడ ఎస్కలేటర్ ఏర్పాటు చేసి దానికి రితిక అని నామకరణం చేశారు.

ఎస్కలేటర్ బాగు చేయండి



ఏడాది కాలంగా సికింద్రాబాద్ సెయింట్ ఆన్స్ స్కూలు ముందు ఉన్న ఎస్కలేటర్ పనిచేయక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఎస్కలేటర్‌కు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- శ్రీకాంత్ నాయక్, స్థానికుడు



సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పీఎస్‌లో వందేమాతరం పాడుతున్న పోలీసులు



వారాసిగూడ శివాజీ విగ్రహం వద్ద వందేమాతరం దేశభక్తి గేయాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు

వందేమాతరం.. వందేమాతరం

పాఠశాలల్లో జాతీయ గేయాలాపన

బౌద్ధనగర్/ అడ్డగుట్ట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి 150ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల్లో ఉదయం 10 గంటలకు విద్యార్థులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. బౌద్ధనగర్ డివిజన్ వారాసిగూడ ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద జ్యోతి మోడల్ స్కూలు విద్యార్థులు, స్థానిక యువకులు, ప్రజలు, మహిళలు వందేమాతరం దేశభక్తి గేయాన్ని ఆలపించారు. అదే విధంగా సికింద్రాబాద్, నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీస్‌స్టేషన్లలోనూ పోలీస్ అధికారులు, సిబ్బంది వందేమాతరం పాడారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్, నాంపల్లి ఆర్పీఎఫ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కల్పన, జ్యోతి మోడల్ స్కూల్ డైరెక్టర్ శివకుమార్, ప్రిన్సిపాల్ సుధారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నాంపల్లిలో వందేమాతరం జాతీయ గేయాన్ని పాడుతున్న ఆర్పీఎఫ్ పోలీసులు తదితరులు



వేతనాల కోసం ఓయూ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యోగులు, పెన్షనర్లు తమ వేతనాలు, పెన్షన్ల కోసం ఆందోళన బాట పట్టారు. ఓయూ ఎన్జీవోస్ అసోసియేషన్, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్, ఎంప్లాయీస్ యూనియన్, టైంస్కేల్ అసోసియేషన్, నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఓయూ పరిపాలనా భవనం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ నెల ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా వేతనాలు, పెన్షన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడం ముమ్మాటికీ ఓయూ అధికారుల వైఫల్యమేనని ఆరోపించారు. పెన్షనర్ల పరిస్థితి మరీ దుర్భరంగా ఉందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తక్షణమే వేతనాలు, పెన్షన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ధర్నా చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులతో మాట్లాడేందుకు ఉన్నతాధికారులు సుముఖత చూపలేదు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కనీస వేతనాలు వెంటనే పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలోని ఓయూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. శుక్రవారం యూనియన్ అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలుగా వేతనాలు పెరగకపోవడంతో కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోజురోజుకీ నిత్యావసర ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వేతనాలు కూడా పెరగాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనాలు అమలు చేయకపోతే, ఉద్యోగులను సమీకరించి ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ చేతన హరీష్

పీఅండ్‌టీ కాలనీలో కార్పొరేటర్ పర్యటన

రామంతాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హబ్సిగూడ డివిజన్ పరిధిలోని పిఅండ్‌టీ కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ అధికారులతో కలిసి పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, వీధి దీపాలు తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకు వెళ్లారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ సమస్యలన్నీ తొందరగా పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ నాగమణి, విద్యుత్ ఏడీఈ దశరథ్, లైన్ మెన్ ప్రవీణ్, బీజేపీ నాయకులు బొమ్మగోని రఘుపతి గౌడ్, అల్కాపురి సురేష్, కట్ట భాస్కర్, స్థానికులు ఉప్పలయ్య, నర్సింహ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



